## క్లుప్తంగా

### తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్లు

**ఆసిఫాబాద్:** ఇటీవల బదిలీపై వచ్చిన తహసీల్దార్ రమేశ్‌ను శనివారం తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డీలర్లు తహసీల్దార్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీటీలు పోచన్న, రాజ్‌కుమార్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రేగుంట కేశవరావు, సంఘ ప్రతినిధులు ఆత్మారాం, రాపర్తి నర్సయ్య, సత్యనారాయణ గౌడ్, తిరుపతి, రాపర్తి శ్రీనివాస్, గోపాల్, పాండురంగ్, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

### ‘చలో కోరుట్ల’ జయప్రదం చేయండి



నాయకులను సన్మానిస్తున్న పద్మశాలీలు

**ఆసిఫాబాద్‌అర్బన్:** జిల్లా కోర్టులో ఈనెల 13న నిర్వహించే పద్మశాలీ రాజకీయ యుద్ధభేరిని జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి అశోక్ పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ జిల్లా కేంద్రంలో పద్మశాలీ వెల్ఫేర్ ట్రస్ట్ కమ్యూనిటీ హాల్‌లో రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో యుద్ధభేరి నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పద్మశాలీలకు జరుగుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అంటరానితనాన్ని రూపుమాపేందుకు పద్మశాలీలు సంఘటితం కావాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు సంపత్, శ్రీరామ, శ్రీనివాస్, దాసరి వెంకటేశ్, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**ఆసిఫాబాద్‌రూరల్:** విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేద వైద్యాధికారి శిల్ప అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది గౌతమి, శంకరయ్య, పాఠశాల టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

**తిర్యాణి:** సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీడీవో సిద్ధార్థ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమంలో భాగంగా ఆశలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైద్యుడు హర్షవర్ధన్, వైద్య సిబ్బంది నైతం శ్రీనివాస్, ప్రమీల తదితరులు ఉన్నారు.

### సాక్షి సినిమాలు

**ఆసిఫాబాద్**
కుమురంభీం : బ్రో
**కాగజ్‌నగర్**
వెంకటరమణ : బ్రో
- ఆసిఫాబాద్‌అర్బన్

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాటా | రూ.200 |
| సిమ్లామిర్చి | 80 |
| దోసకాయ | 60 |
| చామగడ్డ | 80 |
| వంకాయ | 60 |
| బీరకాయ | 100 |
| కాకరకాయ | 80 |
| బెండకాయ | 60 |
| అలసంద | 60 |
| దొండకాయ | 80 |
| పచ్చిమిర్చి | 100 |
| పాలకూర | 60 |
| సోరకాయ | 60 |
| చిక్కుడు కాయ | 100 |
| గోబి(పూల్) | 100 |
| క్యాబేజీ | 60 |

-ఆసిఫాబాద్‌అర్బన్

# నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- సేకరించిన చెత్త ఊరి బయట పడేస్తున్న వైనం
- సేంద్రియ ఎరువు తయారీ ఊసే లేదు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



నిరుపయోగంగా బెండార సెగ్రిగేషన్ షెడ్డు




ఖాళీగా వర్మీ కంపోస్ట్ తయారీ గుంతలు

**వాంకిడి:** గ్రామాల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తూ ప్రతీ పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. ఉపాధిహామీ నిధులతో ఆయా గ్రామాల శివార్లలో నిర్మించిన షెడ్లలో సేకరించిన వ్యర్థాల నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు సేంద్రియ ఎరువు తయారు చేసి జీపీలకు ఆదాయం సమకూర్చాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో సెగ్రిగేషన్ షెడ్లు మందుబాబులకు అడ్డాలుగా మారాయి. కొన్ని గ్రామాల్లో చెత్త సేకరణ జరగకపోవడం, నిర్వహణ అంతంత మాత్రంగానే ఉండడంతో షెడ్లు నిరుపయోగంగా మారాయి.

**మండలంలో 28 సెగ్రిగేషన్ షెడ్లు..**

మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున 28 సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.50 లక్షల ఉపాధిహామీ నిధులు ఖర్చు చేశారు. గ్రామ శివార్లలో, ప్రభుత్వ భూములు లేని జీపీల్లో వాగు పరీవాహక ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. దీంతో 2021లో వచ్చిన భారీ వరదల్లో వాంకిడి, ఖమాన, కనర్‌గాం గ్రామాల్లోని సెగ్రిగేషన్ షెడ్లు కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి ఆయా గ్రామాల్లో సేకరించిన చెత్తను ఊరి బయట పడేసి నిప్పంటించేస్తున్నారు. మిగిలిన షెడ్ల నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉంది. వీటిని ఏర్పాటు చేసిన తొలి నాళ్లలో పర్వాలేదనిపించినా రానురాను అలంకారప్రాయంగా మారుతున్నాయి. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా వీధుల్లో సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడి చెత్తగా వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాల్సి ఉంటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు సీసాలు, ఇతర వ్యర్థాలు ప్రత్యేక గదుల్లో భద్రపరిచి రీసైక్లింగ్ కోసం విక్రయించాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా సెగ్రిగేషన్ షెడ్లు అలంకారప్రాయంగా మారాయి.

**వాంకిడిలో నిర్మాణం అందుకేనా..?**

2021లో వరదల కారణంగా వాంకిడి, ఖమాన, కనర్‌గాం జీపీల్లో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి వాటి నిర్మాణాలపై దృష్టి సారించని అధికారులు ప్రస్తుతం వాంకిడి జీపీలో సెగ్రిగేషన్ షెడ్డు నిర్మాణానికి ఆగమేఘాలపై కసరత్తు చేస్తున్నారు. స్వచ్ఛతలో జిల్లాకు రాష్ట్రంలో మూడో స్థానం లభించగా, రాష్ట్ర పర్యవేక్షణ కమిటీ జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచారం. రాష్ట్ర కమిటీ సభ్యుల పర్యటన షెడ్యూల్‌లో వాంకిడి గ్రామ పంచాయతీ కూడా ఉండడంతోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాంకిడిలో సెగ్రిగేషన్ షెడ్డు నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిర్మిస్తున్న షెడ్డు సైతం వాగు పరీవాహక ప్రాంతంలోనే ఉండడంతో మళ్లీ వరదలు వస్తే కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, సురక్షిత ప్రాంతంలో నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**ప్రజలు సహకరించాలి**

చెత్త సేకరణలో పంచాయతీ కార్మికులకు ప్రజలు సహకరించాలి. తడి, పొడి చెత్తను వేరుగా అందించాలి. సేంద్రియ ఎరువుల తయారీకి చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం మల్టీపర్పస్ వర్కర్లు సమ్మెలో ఉండడంతో చెత్త సేకరణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాంకిడి జీపీలో నూతన సెగ్రిగేషన్ షెడ్డును వరదలకు గురి కాకుండా ఎత్తు ప్రాంతంలోనే నిర్మిస్తున్నాం.

- శివకుమార్, ఎంపీవో, వాంకిడి

# పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమైనవి



పిల్లలకు పాలు తాగిస్తున్న పీడీ సావిత్రి



కౌటాల: వారోత్సవాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు

**ఆసిఫాబాద్‌రూరల్:** పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమైనవని ఐసీడీఎస్ పీడీ సావిత్రి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని చీకుంట, పాడిబండ, తుంపెల్లి అంగన్‌వాడీ సెంటర్లను పర్యవేక్షించి తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ ద్వారా గిరిజన గర్భిణులకు అందించే మిల్లెట్స్ రాగి జావ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ వరలక్ష్మి, సూపర్‌వైజర్ సాంబాయి, అంగన్‌వాడీ టీచర్లు రత్నమాల, పార్వతి, రాజేశ్వరి, లక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

**కౌటాలలో..**

**కౌటాల:** పసి పిల్లలకు తల్లిపాలే శ్రేయస్కరమని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండలంలోని గురుడుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే పిల్లలకు తల్లిపాలు తాగించాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సభీరా బేగం, సర్పంచ్ మెర్వల్లి సునంద, అంగన్‌వాడీ టీచర్లు ప్రేమలత, జీజాబాయి, మోక్షరాణి, సక్కుబాయి, తదితరులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ పట్టణంలో..**

**కాగజ్‌నగర్‌టౌన్:** కాగజ్‌నగర్ పట్టణంలోని జైభీం కాలనీలో శనివారం తల్లిపాల వారోత్సవాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలని ఆమె సూచించారు. తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమన్నారు. అంతకుముందు అంగన్‌వాడీ కేంద్రంలో క్విజ్ నిర్వహించి బహుమతులు అందజేశారు. అంగన్‌వాడీ టీచర్ త్రివేణి, మహిళలు పాల్గొన్నారు.

**రెబ్బెనలో..**

**రెబ్బెన:** తల్లిపాల ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరు గుర్తించాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. శనివారం గోలేటిలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలలో బిడ్డకు కావాల్సిన పోషకాలు సంవృద్ధిగా లభిస్తాయని, బిడ్డలు శారీరంగా, మానసికంగా ఎదిగేందుకు ఉపయోగపడుతాయన్నారు. సర్పంచ్ సుమలత, సూపర్‌వైజర్ సుమలత అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# జీపీ కార్మికుల నిరసనలు



కౌటాల: వంటావార్పు చేస్తున్న కార్మికులు



ఆసిఫాబాద్‌అర్బన్: మాట్లాడుతున్న నాయకులు

**కౌటాల:** ఎంపీడీవో కార్యాలయం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 31వ రోజు కొనసాగింది. కార్మికులు వంటావార్పు చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో కార్మికులు కరుణాకర్, నాగేశ్, ప్రకాశ్, బానీత్, రాజారాం, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేలు స్పందించాలి**

**ఆసిఫాబాద్‌అర్బన్:** గత నెల రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా జిల్లా ఎమ్మెల్యేలు స్పందించడం లేదని, ఇప్పటికైనా కార్మికుల డిమాండ్లు నెరవేర్చడానికి ఇద్దరు ఎమ్మెల్యేలు కృషి చేయాలని కార్మిక సంఘం నాయకుడు మట్టరాజు కోరారు. కలెక్టరేట్ ఎదుట హక్కుల సాధన కోసం గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 31వ రోజుకు చేరింది. నాయకులు బోయిరె నాగేశ్వర్, కై లాస్, సాబీర్, హారిక, యమున, సంతోష్, రాము తదితరులు పాల్గొన్నారు.

### 108లో ప్రసవం



శిశువుతో 108 సిబ్బంది

**సిర్పూర్(టి):** మండలంలోని లోన్‌వెల్లి గ్రామానికి చెందిన గర్భిణీ వనితకు శనివారం పురిటి నొప్పులు రాగా 108కు సమాచారం అందించారు. వెంటనే సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో 108 ఈఎంటీ ఎర్రా అజయ్‌కుమార్ గర్భిణికి నార్మల్ డెలివరీ చేశారు. తల్లి, మగ శిశువు క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. డెలివరీ అనంతరం వారిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

### విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ

**కాగజ్‌నగర్‌రూరల్:** మండలంలోని భట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆల్‌ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఏఐఐటీఏ) ఆధ్వర్యంలో బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు మంగయ్య, ఆనంద్‌బాబు, విజయలక్ష్మి, కమాలుద్దీన్, సంతోశ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు అభినందన

**కాగజ్‌నగర్‌రూరల్:** హైదరాబాద్ హకీంపేటలోని క్రీడా పాఠశాలలో ఆదివారం జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విద్యార్థులను జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ సాంబశివరావు అభినందించారు. గత నెలలో ఆసిఫాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మండలంలోని చింతగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు కార్తీక్, యశ్వంత్, శ్రావణి, సుహాసీలను అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పూర్ణచందర్‌రావు, ప్రధానోపాధ్యాయులు కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**నార్నూర్:** భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ శేషరావు అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని మేడిగూడలో దెబ్బతిన్న పత్తి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలతో పంట పొలాలు కొట్టుకపోవడంతో అనేక మంది రైతులు నష్టపోయారని, తక్షణమే సర్వే నిర్వహించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

# ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి



రెబ్బెన: మాట్లాడుతున్న ఎంపీపీ సౌందర్య

**రెబ్బెన:** రాగల రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండలంలోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం అధిక వర్షాలు, వరద ప్రవాహాలపై తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోశ్, డీఎల్‌పీవో సురేశ్, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్‌రూరల్:** వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గౌరీశంకర్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో సమావేశాన్ని నిర్వహించారు. వాగులు ఉప్పొంగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# పశువులకు టీకాలు వేయించాలి



పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

**కౌటాల:** పశు పోషకులు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యాధికారి ఎస్. శ్రీకాంత్ అన్నారు. శనివారం మండలంలోని వీర్దండి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ 3 నుంచి 4 నెలల వయస్సు పైబడిన ఆవు జాతి, గేదెజాతి పశువులకు టీకాలు వేయించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పోరేతు మడావి రేణుక, సిబ్బంది సందీప్, రాజన్న, భిక్షపతి, శోభన్, రైతులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి పోలీసుల చేయూత



సరుకులు పంపిణీ చేస్తున్న పోలీసులు

**తిర్యాణి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మాణిక్యపూర్ గ్రామానికి చెందిన జ్యోతి అనే నిరుపేద మహిళకు చెందిన ఇల్లు నేలమట్టమైంది. విషయం తెలుసుకున్న సీఐ అల్లం నరేందర్, ఎస్సై చుంచు రమేశ్‌లు శనివారం బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానంగా ఎవరైనా వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శంకర్, కిష్టయ్య తదితరులు ఉన్నారు.

### కాంగ్రెస్ నాయకుల సంబురాలు



టపాసులు కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

**ఆసిఫాబాద్‌అర్బన్:** కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ జైలు శిక్షపై సుప్రీంకోర్టులో ఊరట లభించడంతో శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సరస్వతి, కళావతి, చరణ్, వసంత్‌రావ్, శ్యాం, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**ఆసిఫాబాద్‌రూరల్:** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో డీటీడీవో రమాదేవికి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జున్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్టీలను భర్తీ చేయడంతోపాటు వార్డెన్లను నియమించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగేశ్వర్, కిషన్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

# మట్టిరోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కృష్ణారావు

**కాగజ్‌నగర్‌రూరల్/రెబ్బెన:** సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన సొంత డబ్బుతో మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామం నుంచి రెబ్బెన మండలం మాధవాయిగూడ గ్రామం వరకు మట్టిరోడ్డు నిర్మిస్తుండగా శనివారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు పనులు పరిశీలించారు. అందవెల్లి పెద్ద వాగు వద్ద వంతెన కూలిపోవడంతో రాకపోకలు నిలిచిపోగా ప్రజలు అసౌకర్యానికి గురికాకుండా జగన్నాథ్‌పూర్ నుంచి మాధవాయిగూడెం వరకు మట్టిరోడ్డు వేస్తున్నారు. రెబ్బెన మండలం నుంచి గంగాపూర్, తుంగెడ, మాధవాయిగూడ, జగన్నాథ్‌పూర్ గ్రామాల మీదుగా దహెగాం మండలానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, విలాస్, జమీర్, సిద్ధార్థ పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



తరగతి గదిలోని పాముల పుట్టను పరిశీలిస్తున్న గణపతి

**తిర్యాణి:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షుడు కోట్నాక గణపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తోయరేటి ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తరగతి గదిలోనే పాముల పుట్ట ఉండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

# సమ్మెతో వచ్చిన తంటా..!



చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్న శ్రీధర్

**రెబ్బెన:** గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెతో గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోయి పారిశుధ్యం లోపిస్తోంది. దీంతో శనివారం రెబ్బెన గ్రామ పంచాయతీలో పేరుకుపోయిన చెత్తను సర్పంచ్ కుమారుడు, మాజీ ఉప సర్పంచ్ బొమ్మినేని శ్రీధర్ తానే పంచాయతీ ట్రాక్టర్ నడుపుకుంటూ కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను జేసీబీ సహాయంతో తొలగించి డంపింగ్ యార్డుకు తరలించారు. పంచాయతీలో తాత్కాలిక కార్మికులను జేఏసీ నాయకులు అడ్డుకోవడంతో గత్యంతరం లేక తానే చెత్త తరలిస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

**పెంచికల్‌పేట్:** మండలంలోని చేడ్వాయి గ్రామంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి శనివారం జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతుల కోసం రుణమాఫీ చేయడం అభినందనీయన్నారు. చౌదరి శ్రీనివాస్, ఎస్‌కే బాబు, వెంకటేష్, సురేష్, కోసరి శ్రీనివాస్, ప్రకాశ్, సత్తన్న, తిరుపతి, చింతపూరి సత్తన్న, దస్తగిరి పాల్గొన్నారు.

### 9న బెజ్జూర్‌కు ఆర్ఎస్పీ రాక



మాట్లాడుతున్న నాయకులు

**సిర్పూర్(టి):** బెజ్జూర్ మండల కేంద్రానికి ఈ నెల 9వ తేదీన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రానున్నట్లు రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి ప్రవీణ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆదివాసీలు, పార్టీ నాయకులు, అభిమానులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. నాయకులు సంజయ్‌కుమార్, దుర్గం ప్రవీణ్, ప్రసాద్, రవీందర్, గోపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.